మర్నాడు ఉదయం అతన్ని పిలిపించి అడిగాడా ధనవంతుడు.

"నిన్న రాత్రి నీకు బాగా నిద్ర పట్టిందా?"

"లేదండి." జవాబు చెప్పాడు వాడు.

"ఎందుకని?" ప్రశ్నించాడు.

"నా గుడిసెకి తెర తప్ప తలుపు లేదు. దాంతో మీరిచ్చిన సామగ్రి, డబ్బు ఎవరయినా ఎత్తుకెళ్తారన్న భయంతో నిద్ర పట్టలేదు."

మనిషికి శాంతి, తద్వారా నిద్ర ఎందుకు కరువవుతాయో వెంటనే అర్థమైంది. 'నాది' అనుకునే భౌతిక సంపద పెరిగే కొద్దీ, దాన్ని కాపాడుకోవాలనే తాపత్రయం పెరిగి ఎన్ని విధాల మనిషి సతమతమౌతూ శాంతికి దూరం అవుతాడో ఆ ధనవంతుడికి అర్థమయింది.

జరిగింది ఆ ధనవంతుడు తన గురువుకి చెప్పాడు. ఆయన తన శిష్యుడితో చెప్పాడు.

"ఈ ప్రపంచంలోని అన్ని వస్తువులు, అన్ని సంపదలు కేవలం ఆ భగవంతుడికి చెందినవే తప్ప ఏదీ మనది కాదు. ఒకప్పుడు ధనం తనది అనుకున్న మనిషి నేడు లేడు. నేడు ఆ ధనం నాది అనుకునే మనిషి ఏదో ఓ రోజున మరణించి తీరుతాడు. ఎప్పటికీ ఉండేది ఒక్క ఆ భగవంతుడే కనుక అన్నీ ఆయనకే చెందుతాయి. ఈశావాసోపనిషత్తు బోధించేది సరిగ్గా ఇదే. అందుచేత మన శరీరపోషణకి మించిన సంపాదన మనని అశాంతికి గురి చేస్తుంది తప్ప శాంతిని, సంతోషాన్ని ఇవ్వలేదు. అందుకనే మనం కనీస అవసరాలతో జీవించడం నేర్చుకోవాలని మహాత్ములు చెప్తూంటారు."

## 45. మంచి-చెడు

ఓ సారి శివుడు, పార్వతి మానవ రూపాల్లో భూలోక సంచారం చేస్తున్నారు. ఓ ధనవంతుడి ఇంట్లో వారు ఓ రాత్రి బస కోరారు. అందుకు ఇష్టపడని ఆ ధనవంతుడు అనేక సార్లు బ్రతిమాలించుకుని, అయిష్టంగానే

వారికి తమ భవంతి వెనుక వున్న తాతలనాటి పాడుబడ్డ ఇంటిలో ఉండేందుకు ఏర్పాటు చేసాడు. అతను కాని, అతని కుటుంబ సభ్యులు కాని వారికి తినడానికి సరైన ఆహారం కూడా ఇవ్వలేదు.

ఆ రాత్రి శివుడు ఆ పాడుబడ్డ ఇంటి గోడకు అసహ్యంగా వున్న ఓ కంతని తన మాయాశక్తితో పూడ్చి చూడటానికి అందంగా చేసాడు. పార్వతికి ఆ పని నచ్చక ఆ సంగతే చెప్తే, ఆయన చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

మర్నాడు వాళ్ళు ఓ బీదవాడిని చూసి, ఆ రాత్రికి తమకి కాస్త చోటివ్వమని అడిగారు. అతను సంతోషంగా అందుకు అంగీకరించాడు. ఆ బీదవారికి తమకి సరిపడే ఆహారమే ఉన్నా, వారు దయతో అందులోంచి కొంత తీసి మనుష్య రూపంలో ఉన్న శివపార్వతులకి ఇచ్చారు. అంతేకాక పడుకోడానికి ఆ రాత్రికి తమ మంచాన్ని కూడా వారికి ఇచ్చారు. వాళ్ళు ఇంటి బయట చాప పరచుకుని పడుకున్నారు.

మర్నాడు ఉదయం శివపార్వతులు నిద్రలేచి బయలు దేరడానికి సిద్ధమవుతూండగా ఆ ఇంట్లోని వారి ఏడుపులు పార్వతికి వినబడ్డాయి. ఆమె వెళ్ళి చూస్తే వారి ఆవు మృత కళేబరం కనిపించింది.

"మాకు నిత్యం పాలిచ్చే, ఉన్న ఒక్క ఆవూ పోయింది. ఇక మా గతి ఏమిటి?" అంటూ ఏడుస్తున్న వాళ్ళని చూసిన పార్వతి ఎంతో బాధపడింది.

వారి దగ్గర సెలవు తీసుకుని బయటకి వచ్చాక పార్వతి శివుడితో చెప్పింది.

"మీ ధోరణి నాకు నచ్చలేదండి. అహంకారంతో అతిథులైన మనని అంత అమర్యాదగా చూసిన ఆ ధనవంతుల ఇల్లు బాగు చేసారు. తమకి ఉన్నది త్యాగం చేసి, అతిథులని ఆదరంగా చూసిన ఈ బీదవాళ్ళ ఆవు మరణించబోతోందని ముందుగా మీకు తెలిసిఉండీ దాన్ని రక్షించలేకపోయారు. ఇదేం న్యాయం?"

బదులుగా శివుడు మందహాసం చేసి చెప్పాడు.

"దేవీ! లోకంలో ఏదీ కంటికి కనబడ్డట్లుగా వుండదు. ఆ ధనవంతుడి పూర్వీకులు ఆ గోడలో బంగారు నిధిని దాచారు. వాళ్ళు దానికి మరమ్మత్తు చేయిస్తే ఆ నిధి బయటపడి వారికి దక్కుతుందని వీళ్ళ కంటబడే వీలు లేకుండా ఆ కంతని మూసేసాను."

"అది బావుంది. కాని ఈ బీదవాళ్ళకి ఎందుకు తగిన సహాయం చేయలేదు మీరు?" ప్రశ్నించింది పార్వతి.

"ఎందుకు చేయలేదు? నిన్న రాత్రి ఆ బీదవాడ్ని తీసుకెళ్ళడానికి మృత్యుదేవత వచ్చింది. అతనే వీరి కుటుంబానికి ఆధారం కనుక అతని బదులుగా ఆవుని తీసుకెళ్ళమని దానికి చెప్పాను."

"అర్థమైంది స్వామి. జరిగేది ఏదైనా చెడుగా కనబడ్డా, అది దైవ సంకల్పంతో మంచికే దారితీస్తుంది. కాబట్టి దేన్నీ జరిగింది జరిగినట్లుగా స్వీకరించకూడదు." ఒప్పుకుంది పార్వతి.

## 46. పాప ఫలం

ధర్మశాస్త్రం క్షుణ్ణంగా చదువుకున్న రామనాథానికి పాపపుణ్యాల ఫలితంగానే మనిషికి కష్టసుఖాలు లభిస్తాయన్న నమ్మకం బలంగా వుంది. అందుకని చెడు పనులు చేయద్దని, సాధ్యమైనంతవరకు మంచి పనులే చేయమని అందరికీ బోధిస్తూంటాడు.

అతని కొడుక్కి చదువు పూర్తయ్యాక కలెక్టరాఫీసులో గుమాస్తా ఉద్యోగం వచ్చింది. మొదటిరోజు ఉద్యోగానికి వెళ్ళబోతూ అతను తండ్రి పాదాలకి నమస్కరించాడు. కొడుకుని ఆశీర్వదించి చెప్పాడు రామనాథం.

"మన వెంట వచ్చేవి మనం చేసే మంచి, చెడ్డ పనుల ఫలితాలు మాత్రమే సుమా! అంతే కాని మనం ఆర్జించే డబ్బు కాదు. నువు ఎవరినీ